పేరుపాలెం బీచ్‌లో యువకుడు గల్లంతు

బాధితులను పరామర్శిస్తున్న ఎంఎల్‌ఎ

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఆదివారం ఒక యువకుడు గల్లంతయ్యాడు. దీనికి సంబంధించి ఎస్‌ఐ కె.వెంకటరమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నరసాపురం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పాటి పురుషోత్తం (హనుమ) (18) తన ఐదుగురు స్నేహితులతో కలిసి ఆదివారం పేరుపాలెం బీచ్‌కు వచ్చాడు. ఈ క్రమంలో స్నానం చేస్తూ అలల ఉధృతికి లోపలకు కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. యువకుని ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ సంఘటనపై సమాచారం అందుకున్న ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అక్కడికి చేరుకుని యువకుని బంధువులు, స్నేహితులతో మాట్లాడారు. యువకుని ఆచూకీ కోసం గాలింపు చర్యలు వేగవంతం అధికారులకు సూచించారు.

ముంచిన ముసురు..!

ముంపుబారిన నారుమడులు

నారును రక్షించుకునేందుకు రైతులు అష్టకష్టాలు

చెరువులను తలపిస్తున్న రహదారులు

ప్రజలకు తప్పని అవస్థలు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - భీమవరం

నీట మునిగిన నారుమడిని చూపిస్తున్న రైతు

ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది వర్షాలు ముందునుంచే కురుస్తున్నాయి. ప్రతియేటా ఆగస్టులో కురిసే వర్షాలు ఈ ఏడాది జులై మొదటి వారం నుంచి ప్రారంభమయ్యాయి. అయితే వాతావరణ మార్పులు రైతులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఉపరితల ఆవర్తన ప్రభావంతో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో జిల్లావ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో జిల్లా కేంద్రమైన భీమవరంతోపాటు పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు, ఆచంట, ఉండి తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. రహదాలన్నీ మోకాల్లోతు నీటమునిగి చెరువులను తలపించాయి. భీమవరం బస్టాండ్ ప్రాంతం, ప్రకాశం చౌక్, పాత బస్టాండ్ సెంటర్, మావుళ్లమ్మ గుడి ప్రాంతాలతోపాటు రహదారులన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా భీమవరంలో ఉన్న మూడు అండర్ టన్నెళ్లలో వర్షపు నీరు పెద్దఎత్తున నిలిచిపోయింది. మోకాళ్ల లోతు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. పలు ప్రాంతాల్లో వృక్షాలు నేలకొరిగాయి. వైర్లు తెగి పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇదిలా ఉంటే వరి, ఆక్వా సాగు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో పెట్టిన పెట్టుబడులు నీటి పాలయ్యాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టే ఆక్వా సాగు ఒడిదుడుకులకు లోనవుతోంది. ప్రస్తుత వర్షాలు ఆక్వా రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

ముంపుబారిన నారుమడులు

జిల్లావ్యాప్తంగా 2,11,000 ఎకరాల్లో ఖరీఫ్ సాగవుతోంది. దీని కోసం రైతులు 10,500 ఎకరాల్లో నారుమడులు పోసుకున్నారు. ఇప్పటికీ జిల్లాలో కేవలం 30 వేల ఎకరాల్లో మాత్రమే వరినాట్లు పడ్డాయి. ఇంకా సుమారు లక్షా 80 వేల ఎకరాల వరకు వరినాట్లు వేయాల్సి ఉంది. అయితే జిల్లాలోని ఒక్క తాడేపల్లిగూడెం మండలంలో మాత్రం ఇప్పటికే 90 శాతం వరినాట్లు పూర్తయ్యాయి. ఈ మండలంలో రైతాంగం 25 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నారుమడులతోపాటు నాట్లు వేసిన పొలాలు మునిగిపోయాయి. వర్షపు నీరు కొద్దిరోజులు నిల్వ ఉంటే నాట్లు కూలిపోయే ప్రమాదం కన్పిస్తోంది.

ఇంజిన్‌తో పొలంలోని నీటిని బయటకు తోడుతున్న వైనం

గరగపర్రు, గొల్లలకోడేరు, గొల్లవానితిప్ప, యనమదుర్రు, కొమరాడ పరిసర ప్రాంతాల వరి ఆకుమడులన్నీ నీట మునిగినట్లు రైతులు చెబుతున్నారు. ఎకరాకు నూజివీడు సీడ్స్ 20 కేజీల విత్తనాలను సుమారు రూ.1,750 చొప్పున కొనుగోలు చేసి నారుమడులు వేశామనిచ, తీరా ఆకు ఎదిగి చేతికొచ్చేసరికి కురిసిన వర్షాలకు పూర్తిగా మునిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల చల్లిన విత్తనాల మడులే కొట్టుకుపోయాయని, పంట బోదెలు పూర్తిగా నీటితో మునిగిపోయని చెబుతున్నారు. నీరు ఎటూ లాగకపోవడంతో డీజిల్ మోటార్లను పెట్టి నీరు బయటకు పంపాల్సి వస్తోందని చెబుతున్నారు. దీనిపై అధికారులు కన్నెత్తి చూడకపోవడం దారుణమని కౌలురైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్వా సాగు విలవిల

జిల్లావ్యాప్తంగా 1,06,210 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. దీనిలో 49,400 ఎకరాల్లో రొయ్యలు, 56,810 ఎకరాల్లో చేపలు సాగవుతున్నాయి. ప్రస్తుతం రొయ్యల సాగు ఇబ్బందుల మధ్య సాగుతోంది. ఈ వర్షం మరో రెండు రోజులు కొనసాగితే రొయ్యలు చనిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. చేసేదేమీ లేక అయినకాడికి పట్టుబడులు పడుతున్నారు.

మరో రెండు రోజులు వర్షం

జిల్లావ్యాప్తంగా మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. పశ్చిమ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తన ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇప్పటికే మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలతోపాటు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో రెండు రోజులు వర్షాలు కురిస్తే ఏమిటోనని ఆందోళన చెందుతున్నారు.

భీమవరంలో గజిట్ పత్రాలను దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

జిపిఎస్ గెజిట్‌ను ఉపసంహరించుకోవాలి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి

జిపిఎస్ గెజిట్ పత్రాలు దహనం

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎస్ ఉద్యోగులకు జిపిఎస్ విధానాన్ని అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షుడు పిఎస్.విజయరామరాజు, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు సిహెచ్.కుమారబాబ్జి, డి.ఏసుబాబు, ఎస్.రత్నరాజు, జి.రామకృష్ణంరాజు డిమాండ్ చేశారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద ఆదివారం గెజిట్ నోటిఫికేషన్ కాపీలు దహనం చేశారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏళ్ల తరబడి పోరాటాలు చేస్తున్నారన్నారు. కూటమి అధికారంలోకి వస్తే సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తారని నమ్మిన ఉద్యోగ ఉపాధ్యాయుల ఆశలను వమ్ము చేస్తూ జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల అన్యాయమన్నారు. జిపిఎస్ అమలుపై ఉద్యోగ, ఉపాధ్యాయుల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో గత వైసిపి ప్రభుత్వం జిఒ విడుదలలో జాప్యం చేసిందని తెలిపారు. అయితే ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైసిపి రూపొందించిన జిపిఎస్ విధానాన్ని అమలు చేస్తూ పాత తేదీలతో రాజపత్రాన్ని విడుదల చేయడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను విస్మరించడం వల్లే మూల్యం చెల్లించుకుందని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపి కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పోషించిన పాత్రను నెలలోపే కూటమి ప్రభుత్వం మర్చిపోయినట్లు ఉందని వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యా శాఖ మంత్రి లోకేష్ కూటమి అధికారంలోకి వస్తే సిపిఎస్ స్థానంలో జిపిఎస్ కంటే మెరుగైన విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీ మరిచిపోయారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే రాజపత్రాన్ని ఉపసంహరించుకుని పాత పెన్షన్ విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను తక్షణమే అమలు చేసి 2003 డిఎస్‌సి ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానం వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను అమలు చేయాలని చూస్తే పోరాటాలకు సన్నద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎంకె.స్వామి, కె.త్రిమూర్తులు, ఎం.శంకర్, విఎస్‌పి.శ్రీనివాస్, కె.సత్యనారాయణ, ఎన్.నర్సింహయ్య, బి.కిషోర్, పి.విష్ణుప్రసాద్, కె.రవిచంద్రకుమార్, మున్సిపల్ ఉపాధ్యాయులు ఎం.వనజాక్షి, ఎం.ఉమామహేశ్వరి, తిలక్, గోపీనాథ్ పాల్గొన్నారు.

తణుకులో జిఒ 54 గెజిట్ ప్రతులను దగ్ధం చేస్తున్న నేతలు

నరసాపురంలో..

పాలకొల్లులో..

తణుకు: జిపిఎస్ అమలుకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం అన్యాయమని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టిజె.జయకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జిపిఎస్ అమలుకు విడుదల చేసిన జిఒ 54 గెజిట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా జయకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ రవి, అధ్యక్షులు రంగారావు, జిల్లా కౌన్సిలర్ సురేష్, పాపలింగేశ్వరరావు, దుర్గాబాబు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం: సిపిఎస్ నుండి ఉద్యోగులను జిపిఎస్ లోకి తీసుకొస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.మార్కండేయులు డిమాండ్ చేశారు. ఆదివారం నరసాపురం మండల శాఖ ఆధ్వర్యంలో యుటిఎఫ్ భవనం వద్ద జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా మార్కండేయులు మాట్లాడగా పి.శ్యాంషన్ ఎ.అజయ్‌కుమార్, ఎన్.విజయ్‌కుమార్, యు.రాజశ్రీ, ఎంవి.లక్ష్మీకళ, పి.మీనాక్షి పాల్గొన్నారు.

పాలకొల్లు: జిపిఎస్ అమలుకు విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన గాంధీబొమ్మల సెంటర్ వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేశారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఎస్.జయప్రభ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాత ప్రభుత్వ నిర్ణయాన్ని గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం దారుణమన్నారు. తక్షణం దాన్ని ఉపసంహరించుకుని ఒపిఎస్ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్త ప్రభుత్వం ఒపిఎస్ అమలుకు చర్యలు తీసుకుంటుందని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆశగా ఎదురుచూస్తున్న సమయంలో ఈ గెజిట్ నోటిఫికేషన్ విడుదల అన్యాయమన్నారు. కార్యక్రమంలో యలమంచిలి, పోడూరు, పాలకొల్లు గ్రామీణ, పట్టణాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి పి.క్రాంతికుమార్, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, డి.శ్యామమూర్తి, పంతం రామ్మూర్తినాయుడు, టి.నాగరాజు, జి.ప్రకాష్ రావు, కె.త్రినాథ్, నాయకత్వం వహించారు.

రేషన్ బియ్యం పక్కదారి..!

రెచ్చిపోతున్న మాఫియా

పంపిణీ వాహనాల వద్దే కిలో బియ్యం రూ.10కి కొనుగోలు

అడ్డుకట్ట వేసేందుకు కనీస చర్యలు తీసుకోని అధికారులు

రెండు జిల్లాల్లో 11.73 లక్షల తెల్ల కార్డుదారులు

సబ్సిడీపై కందిపప్పు, పంచదార ఇచ్చేనా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. ఈ తంతు అంతా రేషన్ పంపిణీ చేసే వాహనాల వద్దే జరుగుతున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. రేషన్ మాఫియాతో చేతులు కలిపి సాగుతున్న ఈ దందాను అడ్డుకునేందుకు రెండు జిల్లాల్లోని అధికారులు కనీస చర్యలు తీసుకోని పరిస్థితి నెలకొంది. ఒకటి, రెండు దాడులు నిర్వహించి మమ అన్పించేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. గత ప్రభుత్వ హాయాంలో విచ్చలవిడిగా కొనసాగిన ఈ దందా కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత సైతం కొనసాగుతున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 11.73 లక్షల తెల్లకార్డులు ఉన్నాయి. కార్డులోని ప్రతి వ్యక్తికీ ఐదు కిలోల చొప్పున బియ్యాన్ని ప్రభుత్వం అందిస్తోంది. గతంలో కిలో రూపాయికి ఇవ్వగా కరోనా తర్వాత ఉచితంగా ఇస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. 2019 ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే రేషన్ దుకాణాల్లో నాణ్యమైన సన్నబియ్యం అందిస్తామని వైసిపి వాగ్దానం చేసినప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఎన్నో పేద కుటుంబాలు రేషన్ బియ్యంతోనే కడుపు నింపుకుంటున్నాయి. మారిన కాలమాన పరిస్థితుల నేపథ్యంలో సుగర్ వంటి వ్యాధుల కారణంగా రేషన్ బియ్యం తినేందుకు చాలామంది జంకుతున్నారు. ప్రజలు తినే నాణ్యమైన బియ్యం అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. ఇదే అదునుగా రేషన్ మాఫియా విచ్చలవిడిగా రెచ్చిపోతుంది. రేషన్ బియ్యం లబ్ధిదారుల నుంచి పెద్దఎత్తున కొనుగోలు చేసి రీసైక్లింగ్ చేసి అమ్మకాలు చేయడం, ఇతర దేశాలకు ఎగుమతి చేయడం వంటి అక్రమాలు పెద్దఎత్తున సాగిస్తోంది. కాకినాడ కేంద్రంగా ఇది పెద్దఎత్తున సాగుతున్నట్లు ఇటీవల బయపడిన సంగతి అందరికీ తెలిసిందే. రెండు జిల్లాల్లో రేషన్ పంపిణీకి 751 వాహనాలను ఉపయోగిస్తున్నారు. గతంలో రేషన్‌దుకాణాల్లో బియ్యం కొనుగోలు చేయాలంటే కొంత భయపడే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండాపోయింది. రేషన్ వాహనాల వద్దే కిలో రూ.పది చొప్పున కొనుగోలు చేస్తున్నారు. వేలిముద్ర వేయించుకుని బియ్యం ఇవ్వకుండా డబ్బులు ఇచ్చేస్తున్న పరిస్థితి సాగుతోంది. రేషన్ పంపిణీ సమయంలో వాహనాలు తనిఖీ చేస్తే బియ్యం నిల్వలను బట్టి అసలు విషయం ఇట్టే భయపడుతోంది. అయితే పౌరసరఫరాల శాఖాధికారులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. ఈ దందా అంతా యథేచ్ఛగానే సాగిపోతుంది. అయినప్పటికీ ఏఒక్కరూ పట్టించుకోని పరిస్థితి నెలకొంది. నాణ్యమైన సన్న బియ్యం అందిస్తే ఏఒక్కరూ విక్రయించారు. ప్రభుత్వం మాత్రం ఆ విధంగా చేయడం లేదు. దీంతో రేషన్ బియ్యం అక్రమార్కుల చేతుల్లోకి చేరుతోంది. ప్రభుత్వం మారడంతో ఇప్పుడైనా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారా అనే చర్చ నడుస్తోంది.

సబ్సిడీపై కందిపప్పు, పంచదార ఏది..?

2014కు ముందు కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో రేషన్ దుకాణాల్లో తొమ్మిది సరుకులను సంచిలో పెట్టి అందించేవారు. బియ్యం, కిలో పామాయిల్, కిలో చపాతీ పిండి, కిలో గోధుమలు, అరకిలో పంచదార, ఉప్పు ప్యాకెట్, కారం, పసుపు, చింతపండు వంటివి ఇచ్చేవారు. ఇవి పేదలకు ఎంతగానో ఉపయోగపడేవి. 2014లో టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత బియ్యం, పంచదార, చపాతి పిండి, కిరోసిన్‌కు పరిమితమైంది. 2019లో వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత బియ్యం, కందిపప్పు, పంచదార కొంతకాలం ఇచ్చారు. తర్వాత బియ్యం, పంచదార మాత్రమే ఇచ్చారు. కొన్ని నెలలు బియ్యం ఒక్కటే ఇచ్చిన పరిస్థితి ఉంది. కొత్త ప్రభుత్వం వచ్చాక సైతం జులైలో బియ్యం మాత్రమే పంపిణీ చేశారు. కందిపప్పు, పంచదార ఇవ్వలేదు. బహిరంగ మార్కెట్లో విపరీతంగా ధరలు పెరిగిపోయాయి. సబ్సిడీపై సరుకులను రేషన్ కార్డుదారులకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

సాగు సాగేనా..!

నత్తనడకన కాలువలో గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు కాలువలో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క

నరసాపురం నియోజకవర్గంలోని గ్రామాలు సాగునీటి కాలువలకు శివారున ఉన్నాయి. సాధారణంగా కాలువలకు నీటిని విడుదల చేసిన వారం, పది రోజుల వరకూ శివారుకు నీరు చేరదు. ఈ ఏడాది కాలువల ప్రక్షాళన చేయకపోవడంతో గుర్రపుడెక్క, తూడు, నాచు విపరీతంగా పెరిగింది. దీని ప్రభావంతో నరసాపురం ప్రధాన కాలువ శివారున ఉన్న మొగల్తూరు, రామన్నపాలెం గ్రామాలకు, జిన్నూరు కాలువ శివారున ఉన్న శేరేపాలెం, కొత్తపాలెం తదితర గ్రామాలకు నేటికీ నీరు చేరలేదు.

ఇటీవల కాలువల ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. కొద్దిరోజుల కిందటే పనులు దక్కించుకున్న గుత్తేదారు నత్తనడకన కొనసాగిస్తున్నారు. ఇదే విధానం కొనసాగితే ఈ నెలాఖరు వరకూ పనులు కొనసాగుతాయని రైతులు చెబుతున్నారు. దీంతో సార్వాసాగు ఇప్పటికే జాప్యం జరిగిందని మరింత జాప్యం జరిగే ప్రమాదం ఉంటుందని రైతులు వాపోతున్నారు.

మరో నాలుగు రోజుల్లో పనులు పూర్తి

మోహన్‌కృష్ణ, ఇరిగేషన్ శాఖ ఎఇ, నరసాపురం

కాలువలో తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు ప్రారంభించాం. నరసాపురం నుండి సీతారాంపురం వరకూ కాలువలోని చెత్తను తొలగిస్తున్నాం. మరో నాలుగు రోజుల్లో కాలువ శివారు వరకూ ఉన్న తూడును తొలగిస్తాం.

ఆదిలోనే అన్నదాత కష్టాలు

ప్రజాశక్తి - నరసాపురం

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు వేసిన నారుమడులు నీట మునిగాయి. మండలంలోని యర్రంశెట్టివారిపాలెం, రుస్తుంబాద, సీతారామపురం ప్రాంతాల్లో ముంపు సమస్య ఎక్కువగా ఉంది. ఆదివారం రైతులు మోటార్లు, బకెట్లు ద్వారా నారుమడుల్లోని నీటిని తోడారు.

నీటిని తొలగించాలి

మొగల్తూరు: నారుమడుల్లో చేరిన నీటిని తొలగిస్తే ఎటువంటి ఇబ్బందీ ఉండదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నారుమళ్ల చుట్టూ గట్లు ఎత్తుగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నారుమడుల్లో నీటిని తొలగించి నారుపై రెండు గ్రాముల కార్బోడిజమ్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

పెనుమంట్ర: ఆదివారం ఉదయం కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చిన్నపాటి వర్షం కురిసినా గోతుల్లో నీరు ఉండిపోవడంతో వాహనాలు ఇబ్బంది పడుతున్నారు. వర్షం వల్ల పలుచోట్ల వరి నాట్లకు ఆటంకం ఏర్పడింది. గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో బురదమయం కావడంతో మురుగుపోయే దారి లేనందున స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

నరసాపురం :నారుమడుల నుండి నీరు తోడుతున్న రైతు

తాళ్లకోడు కాలనీలో వసతులు కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - ఆకివీడు

మాట్లాడుతున్న గోపాలన్

తాళ్లకోడులోని 73 ఎకరాల్లో పేదలు నిర్మించుకున్న కాలనీలో రోడ్లు, తాగునీరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెంటనే మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల కార్యదర్శి కె.తవిటినాయుడు అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం ఆదివారం మండల కార్యాలయంలో జరిగింది. సమావేశంలో గోపాలన్ మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే తాళ్లకోడు కాలనీ మునిగిపోతుందన్నారు. ప్రజలు బయటికి వెళ్లాలన్నా, రావాలన్నా చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే డెంగీ, విషజ్వరాలు, అతిసార వంటివి ప్రబలే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా కలెక్టర్, నగర పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించి సహాయక చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. రోడ్లు, తాగునీరు అందించాలన్నారు. అవసరమైన మందులు ముందస్తుగా పంపిణీ చేయాలని సూచించారు. సమావేశంలో పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, సందక ఉదయకుమారి, డోకల రవితేజ, బొక్కా వర్మ, బొడ్డుపల్లి రాంబాబు పాల్గొన్నారు.

సెల్‌ఛార్జీల మోత మోయలేం..!

ఆచంటలో బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం

ప్రజాశక్తి - ఆచంట

మొబైల్ ఫోన్ నేడు ప్రతిఒక్కరికీ నిత్యావసర వస్తువుగా మారింది. కేంద్రంలో మోడీ మూడోసారి అధికారంలోకొచ్చిన కొద్ది రోజులకే ప్రయివేట్ టెలికాం కంపెనీలు మొబైల్ రీఛార్జి ధరలను భారీగా పెంచి ప్రజలపై రూ 20 వేల కోట్ల భారాన్ని మోపాయి. జిల్లాలో విస్తృతంగా వినియోగంలో ఉన్న రెండు ప్రధాన ప్రయివేటు టెలికాం సంస్థలు జియో, ఎయిర్‌టెల్ సంస్థలు ఇటీవలే భారీగా టారిఫ్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే. దీంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. తక్షణమే వాటిని ఉపసంహరించుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో బిఎస్‌ఎన్‌ఎల్ వైపు వినియోగదారులు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. అయితే అదే కేంద్ర ప్రభుత్వం బిఎస్‌ఎన్‌ఎల్ అప్‌గ్రేడ్ కాకుండా వివక్షపూరితంగా వ్యవహరిస్తోందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రయివేటు టెలికాం సంస్థలు 5జి సేవల్లో దూకుడుగా ఉండగా బిఎస్‌ఎన్‌ఎల్ మాత్రం 4జి సేవలను సైతం పూర్తిస్థాయిలో అందించలేని పరిస్థితిలో ఉండటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తక్షణమే బిఎస్‌ఎన్‌ఎల్ 4జి, 5జి సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అదే సమయంలో ప్రయివేటు కంపెనీల ధరలు తగ్గించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వినియోగదారులపై మోయలేని భారం

ఆచంట పెద్దిరాజు, వినియోగదారుడు, ఆచంట

ప్రయివేట్ టెలికాం కంపెనీలు మొబైల్ రీఛార్జి ధరలను విపరీతంగా పెంచడం పెనుభారం. చాలా బాధాకరం. ఒకపక్క నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోతుంటే మరోపక్క రీఛార్జి భారం పెరగడం మోయలేని విధంగా ఉంది. నేను బట్టలు ఇస్త్రీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఇప్పటికే భారాలు, అప్పులతో సతమతమవుతున్న నేపథ్యంలో గోరుచుట్టుపై రోకలి పోటులా సెల్‌ఫోన్ రీఛార్జీల మోత మోగించడం సరికాదు. వెంటనే పెంచిన ఛార్జీలు తగ్గించాలి.

ఇప్పటికే భారాలతో సతమతం

నెక్కంటి వీరబ్రహ్మం, ఆచంట

ఇప్పటికే మార్కెట్లో అన్ని నిత్యావసరాల ధరలు పెరిగిపోవడంతో సతమతమవుతున్నాం. ఈ తరుణంలో మొబైల్ ఛార్జీలు పెరగడం చాలా ఇబ్బందికరం. మా ఇంటిలో మూడు సిమ్‌లు ఉన్నాయి. రెండు ఎయిర్‌టెల్, ఒకటి జియో. నెలకు రీఛార్జికి రూ.600 అయ్యేది. ఇప్పుడు కొత్త రీఛార్జీల ప్రకారం అదనంగా సొమ్ము చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు సిగ్నల్స్ సమస్య వేధిస్తోంది. వెంటనే పెంచిన ధరలు తగ్గించి సిగ్నల్స్ సమస్య పరిష్కరించాలి.

బిఎస్‌ఎన్‌ఎల్‌నే బెటర్

ఎస్‌విఎన్.శర్మ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు

ప్రయివేట్ టెలికాం సంస్థలు డేటా ఛార్జీలను పెంచుకుంటూపోతున్నాయి. పాత ఛార్జీలను అమలు చేసి వినియోగదారులకు ఉపశమనం కల్గిస్తోంది. టెలికాం రంగంలో ప్రయివేటీకరణ ఫలితంగా ప్రజలపై ఆయా సంస్థలు ఎడతెగని ఆర్థిక భారాలు మోపుతున్నాయి. దీన్ని కేంద్ర ప్రభుత్వం నియంత్రించడం లేదు. ప్రయివేటు కంపెనీలు పెంచిన రీఛార్జీల ధరలన తక్షణమే తగ్గించాలి.

బిఎస్‌ఎన్‌ఎల్‌ను రక్షించాలి

కేతా గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

దేశంలో రెండు ప్రధాన ప్రయివేటు టెలికాం సంస్థలు జియో, ఎయిర్‌టెల్ పోటాపోటీగా ధరలు పెంచి వినియోగదారులపై పెనుభారాన్ని మోపాయి. ప్రభుత్వరంగ సంస్థ బిఎస్‌ఎన్‌ఎల్ మారుమూల గ్రామాల్లోనూ తన సేవలందిస్తోంది. బిఎస్‌ఎన్‌ఎల్‌కు 4జి, 5జి సేవలందించే అవకాశం, సాంకేతికత రాకుండా మోడీ ప్రభుత్వం అడ్డుకుంటోంది. మా ఇంట్లో నాలుగు ఫోన్లు వాడుతున్నారు. ఇప్పటికే రూ.600 రీఛార్జి భారం ఉండగా పెరిగిన ధరలతో నెలవారీ ఖర్చు రూ.12 వందల నుంచి రూ.15 వందల వరకూ పెరిగింది. తక్షణమే కేంద్ర ప్రభుత్వం బిఎస్‌ఎన్‌ఎల్‌కు సహకరించి వినియోగదారునికి మెరుగైన సౌకర్యాలు అందించేలా బలోపేతం చేయాలి. ప్రయివేటు కంపెనీలు పెంచిన ధరలు తగ్గించేలా చర్యలు చేపట్టాలి.

మారుమూల ప్రాంతాలకు 4జి సౌకర్యం

ఎం.సందీప్, జూనియర్ టెలికం ఆఫీసర్, ఆచంట

మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు బిఎస్‌ఎన్‌ఎల్ 4జి టెక్నాలజీ అందుబాటులోకి తీసుకొస్తున్నాం. జిల్లాలో 386 టెలిఫోన్ ఎక్స్ఛేంజీల్లో 4జి ఇంటర్నెట్‌తోపాటు హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యమూ కల్పిస్తున్నాం. ఇప్పటికే ఏలూరు, భీమవరంలో 4జి సేవలు అందుబాటులోకి వచ్చాయి. మరో రెండు నెలల్లో జిల్లాలోని అన్ని మారుమూల ప్రాంతాలకు వీటిని విస్తరించనున్నాం.

పలుచోట్ల ఉచిత కంటి వైద్యశిబిరాలు

ప్రజాశక్తి - కాళ్ల

పల్లెలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని గామ సర్పంచి సాదు శ్రీదేవి శ్రీనివాస్ అన్నారు. కాళ్లకూరులో భీమవరానికి చెందిన ఐడియల్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. కాటరాక్ట్, రెటినా పలు రకాల కంటి సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు చేశారు. సుమారు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐడియల్ హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ పి.భాస్కరరాజు, డాక్టర్ పి.సూర్య సౌమిత్, డాక్టర్ పి.కృష్ణ చైతన్య, పి.లచ్చిరాజు (రాజా) పాల్గొన్నారు.

తణుకు : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా ఇంటింటికీ వైద్యం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు, హుస్సేన్ అహ్మద్ తణుకు, వేల్పూరు ప్రాంతాల్లో పర్యటించి ఏడుగురు వృద్ధులకు ఉచిత వైద్యసేవలందించారు. డాక్టర్ కెవి.రావు ఇండియా నెట్‌వర్క్ ఫౌండేషన్ అమెరికా సంస్థ వారి ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తణుకు : వృద్ధురాలికి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కాళ్లకూరులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సూర్యసౌమిత్

గాయపడిన వ్యక్తికి జనసేన చేయూత

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల ప్రమాదంలో గాయపడిన ఉండి గ్రామానికి చెందిన జన సైనికుడు చిప్పాడ వెంకటేష్‌కు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు ఆధ్వర్యంలో జన సైనికులు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ వృత్తిరీత్యా వడ్రంగి పనిచేస్తూ పార్టీలో చురుకైన పాత్ర వహించే చిప్పాడ వెంకటేష్ ఇటీవల ప్రమాదంలో గాయపడ్డాడు. వైద్యులు చేతికి 12 కుట్లు వేశారని తెలియడంతో మండల అధ్యక్షులు యడవల్లి వెంకటేశ్వరరావు, గ్రామ అధ్యక్షులు ఆరేపల్లి వెంకటేష్‌తో కలిసి వెంకటేష్‌ను పరామర్శించారు. అనంతరం పార్టీ తరపున వెంకటేష్‌కు వైద్యం నిమిత్తం రూ.10,500 నగదు అందజేశారు. వెంకటేష్‌ను పరామర్శించిన వారిలో మోపిదేవి హరి, బెల్లపు బాలాజీ, నల్లమాటి రమేష్ ఉన్నారు.

బాధితునికి సాయం అందజేస్తున్న జనసేన నేతలు

బాధితురాలికి వాకర్స్ క్లబ్ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

వట్టణంలోని 15వ వార్డులో ఉంటున్న వృద్ధురాలు ఉల్లి కృష్ణవేణి పక్షవాతంతో బాధపడుతూ మందులు కొనుక్కోవడానికి ఇబ్బందులు పడుతోంది. ఈ విషయాన్ని వాకర్స్ క్లబ్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ ఆమెకు రూ.7 వేల విలువైన మందులను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, నంబూరి గంగా పవన్, బొలిశెట్టి నాగరాజు పాల్గొన్నారు.

వృద్ధురాలికి సాయం అందజేస్తున్న సభ్యులు

పాఠశాల అభివృద్ధికి ఎంఎల్ఎ కృషి అభినందనీయం

ప్రజాశక్తి - ఉండి

శత వసంతాల చరిత్ర కలిగిన ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు కృషి చేయడం అభినందనీయమని 1988-89 బ్యాచ్‌కు చెందిన పలువురు విద్యార్థులు కొనియాడారు. ఆదివారం పాఠశాలలో 1988-89 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులు గులిపల్లి అచ్చారావు, కర్రి శ్రీనివాస్, కొల్లి సాయిరాం, వీరమల్లు మల్లేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ తమ బ్యాచ్ విద్యార్థులు 2011లో గెట్ టుగెదర్ ఏర్పాటు చేసుకున్నామని, అప్పట్లో పాఠశాలకు అవసరమైన 24 ఫ్యాన్లు ఇవ్వడం జరిగిందని, మరలా 2018లో శతాబ్ది ఉత్సవాల సమయంలో పాఠశాల మైదానం వర్షాలకు నీటితో నిండిపోవడంతో అప్పటి ప్రధానోపాధ్యాయుల సూచన మేరకు మైదానం పూడిక నిమిత్తం లక్షా ఇరవై ఐదు వేల రూపాయల నగదును పాఠశాలకు ఇచ్చామని తెలిపారు. ఇటీవల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.రామలక్ష్మి పాఠశాలలో చదివే విద్యార్థులకు ఫిజిక్స్ ల్యాబ్ అవసరమని చెప్పడంతో దానికి కావాల్సిన నగదును ఇచ్చామని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు దాతలను సమీకరించి అభివృద్ధి చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. తమ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు కొందరు తమ మధ్య లేరని వారికి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు ముదునూరి బంగార్రాజు, ఇందుకూరి శారద, కనిగళ్ల నాగేశ్వరరావు, కారుమూరి శ్రీరాఘవ గుప్త, కొమ్మన రాఘవ, టి.శ్రీనివాస్, ముంగండ శ్రీను, అపర్ణ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

నేడు ఛాంబర్స్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు: స్థానిక ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ ట్వెన్కోటెక్, ఇన్ఫోల్యూమి, హాప్టెక్ కంపెనీల్లో ఉద్యోగాలకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే విద్యార్థులు 2022, 2023, 2024 ఫైనలియర్ విద్యార్థులు, ఆయా సంవత్సరాల్లో ఏదైనా డిగ్రీ, పీజీ చేసిన విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థులు సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని ప్రిన్సిపల్ తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ యు.జానకి రామయ్య నంబర్ 9912046234ను సంప్రదించాలని కోరారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన భక్తిగీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం ప్రసాదం వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ముత్యాలమ్మ సన్నిధిలో దేవాదాయ శాఖ డిసి

దేవాదాయ ధర్మాదాయ శాఖ కృష్ణా జిల్లా డిప్యూటీ కమిషనర్ చక్రధరరావు ఆదివారం మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది అమ్మవారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదాన్ని ఆయనకు అందజేశారు.

నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం

ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - మొగల్తూరు

నరసాపురం నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని జగన్నాధపురంలో ఆదివారం టిడిపి, జనసేన యూత్ సభ్యులు నడింపల్లి శ్యామ్‌కుమార్ రాజు, కుక్కల రవిబాబు, ముచ్చర్ల రాంబాబు, కొప్పినేని ఏసు, యడ్లపల్లి లక్ష్మణస్వామి (చిన్న) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన ఎంఎల్ఎలు, ఎంపీలు విజయం సాధించారన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే విధంగా పరిపాలన నిజాయతీగా చేస్తానన్నారు. నరసాపురం నియోజకవర్గం ఏర్పడిన అనంతరం ఎన్నడూ లేని విధంగా అధిక మెజార్టీతో వారు విజయ సాధించారన్నారు. గ్రామాల్లో తాగు, మురుగు డ్రెయిన్లు, సిమెంట్ రోడ్లు, కాళీపట్టణం జమిందార్ భూముల సమస్య వంటి అభివృద్ధి పనులు తగిన ప్రాధాన్యతను బట్టి అందరి సహకారంతో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో నరసాపురం నియోజకవర్గం పూర్తి స్థాయిలా అభివృద్ధి చేస్తానన్నారు. భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నుండి వయా జగన్నాధపురం, మెలపర్రు బీచ్ వరకూ నాలుగు వరసల రహదారిని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. భీమవరం నరసాపురం పెడన తీర ప్రాంతాల అభివృద్ధికి పనులను చేపడతామన్నారు. పెడన శాసనసభ్యులు కాగితపు కష్ణ ప్రసాద్ మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాలు రాష్ట్రం అధోగతి పాలు అవ్వడం వల్లే ప్రస్తుతం ఎన్‌డిఎ కూటమికి ఓటర్లు అధిక మెజార్టీతో విజయం సాధించారన్నారు. తొలుత ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి ఆంజనేయులు, పెడన ఎంఎల్ఎ కాగితపు కృష్ణ ప్రసాద్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు తదితరులను సత్కరించారు. అనంతరం గ్రామంలో నేతలు ఏర్పాటుచేసిన టిడిపి జనసేన జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బిజెపి నర్సాపూర్ నియోజకవర్గ మేకల సతీష్, ఆయా పార్టీల మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, కొల్లాటి గోపి, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్

పాస్‌పోర్టు పోయినది

ప.గో.జిల్లా, పాలకొల్లు పట్టణంకు చెందిన విపర్తి శాంతి, భర్త: రమేష్, డోరు నెం. 44-3-5, వెలమగూడెం, పాలకొల్లు నివాసి అయిన నేను **22-6-2024** తేదీన పాలకొల్లులో ఇల్లు మారుతుండగా పాలకొల్లులో పై డోర్ నెంబర్ లో నా యొక్క ఒరిజినల్ పాస్ పోర్టు పోయినది. నా పాస్ పోర్ట్ నెంబర్ **P5227926**. నేను వైజాగ్ లో **27-1-2017**న పొందాను. నేను ఎంతవెతికినా నా ఒరిజినల్ పాస్ పోర్ట్ దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికిన నాకు అందజేయవలసినదిగా కోరి ప్రార్థించుచున్నాను.

ఫోన్ నెంబర్ 9989270822

రైతుల దుఃఖదాయని.. నాచుగుంట క్వారీ మురుగు బోదె

ఏటా ముంపుబారిన పడుతున్న 450 ఎకరాలు

మురుగు బోదెను ప్రక్షాళించాలని రైతుల మొర

ప్రజాశక్తి - ఉంగుటూరు

బాదంపూడి నుంచి జాతీయ రహదారికి ఆనుకుని నాచుగుంట వరకూ ప్రవహిస్తున్న నాచుగుంట క్వారీ మురుగుబోదె పూడికతో నిండటం, డ్రెయినేజీ శాఖ పట్టించుకోకపోవడం, ఆక్రమణలు తదితర కారణాలతో ఏటా వందలాది ఎకరాలు వరిపైరు ముంపుబారిన పడుతోంది. బాదంపూడి మత్స్య కేంద్రం నుంచి 3.4 కిలోమీటర్ల పొడువునా నాచుగుంట వరకు మురుగు కాలువ ఉంది. దీన్నే నాచుగుంట క్వారీ మురుగు బోదెగా పిలుస్తారు. ఈ బోదె స్టార్టింగ్ పాయింట్ వద్ద బాటం రెండు మీటర్లు వెడల్పు ఉంచి లాస్ట్ పాయింట్ వద్ద 6 మీటర్లు బాటం వెడల్పు ఉండాలి. బాదంపూడి వద్ద ఏలూరు కాలువ ఎస్కేప్, ప్రకాశరావుపాలెం తదితర ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరంతా ఈ మురుగుబోదె ద్వారా నాచుగుంట వద్ద జాతీయ రహదారి దిగువన అండర్ టన్నెల్ ద్వారా కొల్లేరులో కలవాల్సి ఉంది. ఇదీ క్వారీ మురుగు బోదె నైసర్గిక స్వరూపం.

డ్రెయినేజీ శాఖ నిర్వహణా లోపమే రైతులకు నష్టం

వెల్లమిల్లి, బాదంపూడి గ్రామాలకు చెందిన రైతులకు చెందిన సుమారు 450 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాకాలంలో చేలల్లో అధిక, వరద నీరంతా మురుగు కాలువలోకి వెళ్లాల్సి ఉంది. అయితే స్థాయికి మించి వరద నీరు ఈ మురుగుబోదెలోకి రావడం, ఆ నీరంతా దిగువకు వెళ్లే దారులు పూడిపోవడం, అనధికార ఆక్రమణలు, తూరలు పెట్టి దారులు వేయడం, గుర్రపుడెక్క, తూడు తొలగించే పనులను సకాలంలో చేపట్టకపోవడం వల్లే తమ పొలాలు ముంపుబారిన పడుతున్నాయని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ కట్టడాలే ముంపునకు కారణమా

ఈ బోదె వెళ్లే దారిలో పలుచోట్ల అనుమతులు లేకుండా తూరలతో దారులు వేశారు. ఆ తూరలు కుంగిపోయి మట్టితో పూడుకుపోవడంతో నీటి ప్రవాహం ఆగిపోయి ఆ నీరంతా వెనక్కి పొడిచి పొలాలను ముంచెత్తుతోంది. అంతేకాకుండా దీన్ని ఆనుకుని చేపల చెరువులు వెలిశాయి. వాటి నుంచి కూడా నీటి ప్రవాహం పెరుగుతోందని రైతులు వాపోతున్నారు.

నాచుగుంట క్వారీ మురుగు బోదెలో దట్టంగా అలుముకున్న తూడు

ప్రతియేటా ముంపుతో తీవ్ర నష్టం

చంద్రు రామకృష్ణ, రైతు, బాదంపూడి



నాచుగుంట క్వారీ మురుగుబోదె మా పాలిట దుఃఖదాయనిగా మారింది. కొద్దిపాటి వర్షం వస్తే వరినారు కుళ్లిపోతోంది. ఇటు జాతీయ రహదారి, అటు రైలుమార్గం మధ్యలో వెల్లమిల్లి, బాదంపూడి గ్రామాలకు చెందిన 450 ఎకరాల్లో వరిని పండిస్తున్నాం. ప్రకాశరావుపాలెం, తెలికచర్ల, వెంకటరామన్నగూడెం, తాడిపూడి కాలువ తదితర 9 ప్రాంతాల నుంచి వరద నీరంతా ఈ బోదె ద్వారా నాచుగుంట వద్ద యుటి-3 నుంచి కొల్లేరులోకి వెళ్లాలి. అయితే వెల్లమిల్లి రేవు వద్ద బోదెపై తూరలు పెట్టి దానిపై దారి పోశారు. ఆ తూరలు శిథిలమై మట్టి జారిపోయి బోదె పూడుకుపోవడం వల్లే నీరు నాచుగుంట వైపు వెళ్లే దారిలేక రివర్స్‌ఫ్లోతో బోదె నిండిపోతుంది. ఆ నీరంతా మా పొలాలను ముంచెత్తడం ప్రతియేటా సర్వసాధారణమైంది. నేను ఐదెకరాలు సాగు చేస్తున్నాను. వరదలకు సగం పంట నష్టపోవాల్సి వస్తోంది. బాదంపూడి ఎస్కేప్ వద్ద అధిక నీటిని దిగువకు వదిలే చర్యలు చేస్తే కొంతవరకు ఉపశమనం. ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా మా బాధలు తీరడం లేదు.

రైతు గోడు పట్టించుకునే వారు లేరు

సిహెచ్.అప్పారావు, రైతు, బాదంపూడి

ఏదోకసారి వరద ముంపు అంటే ప్రకృతి వైపరీత్యం అనుకోవచ్చు. అయితే వర్షాకాలంలో ప్రతియేటా మాకు పెద్ద సమస్యగా మారింది. బాదంపూడి నుంచి వెల్లమిల్లి రేవు వరకూ తూడు, గుర్రపుడెక్క దట్టంగా పేరుకుపోయింది. దీనికి తోడు వెల్లమిల్లి రేవు వద్ద 20 టన్నుల లారీలు వెళ్లేందుకు మురుగుకాలువపై ఓ వ్యాపారి తూరలతో పూడ్చారు. అందువల్ల నీరు ముందుకు కదలడం లేదు. ఆ నీరంతా మా పొలాల పైకి పొంగిపొర్లుతోంది.

పూడికతీయించే చర్యలు తీసుకుంటాం

డ్రెయినేజీ శాఖ ఎఇ ఎవి.సత్యనారాయణ

నాచుగుంట క్వారీ మురుగుకాలువలో పూడిక, తూడు, గుర్రపు డెక్క తొలగింపు వెంటనే చేపడతాం. వాస్తవంగా ఈ మురుగు కాలువ వెంబడి పలు ఆక్రమణలున్నాయి. బోదెను యంత్రాల సాయంతో తవ్వించాలంటే నిబంధనల ప్రకారం ప్రతి మూడేళ్లకు ఒకసారి చేపట్టాల్సి ఉంది. ప్రతిపాదనలు పెట్టి అనుమతులు తీసుకుని వచ్చే వేసవిలో బోదెను తవ్వించే చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ఉన్న ఈ బోదెను 40 మీటర్ల వెడల్పు చేయాలని రైతుల కోరిక మీదట గతంలోనే ప్రతిపాదనలు పంపి కావాల్సిన భూసేకరణ కోసం తమ శాఖ నుంచి అన్ని ప్రయత్నాలూ చేశాం. అయితే ఆరు వరుసల జాతీయ రహదారి విస్తరణ లేకపోవడంతో ప్రతిపాదనలకు అనుమతులు రాలేదు. పలు మురుగుబోదెల్లో పూడిక తీసేందుకు నిధులొచ్చాయి. నాచుగుంట క్వారీ మురుగు బోదెలో పూడికతీత పనులు రూ.14 లక్షలతో చేయిస్తాం.

18.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు

నరసాపురం: జిల్లాలో ఆదివారం ఉదయం వరకూ గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. పాలకొల్లులో 42.2 మిల్లీమీటర్లు, తాడేపల్లిగూడెం 30, పెనుమంట్ర 27.8, పెంటపాడు 27, వీరవాసరం, గణపవరంల్లో 24.2, అత్తిలి 22.6, యలమంచిలి 22.4, ఇరగవరం 22, ఆకివీడు 20, పోడూరు 18.8, పెనుగొండ 16.8, పాలకోడేరు 15.4, నరసాపురంలో 13.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటు వర్షపాతం 18.6 మిల్లీమీటర్లుగా నమోదైందని అధికారులు తెలిపారు.

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పాలకొల్లు

O.S. No. 77/2023

బిట్వీన్:
పైలా లక్ష్మి -వాది
మరియు
తాడి శ్రీనివాసులు @ శ్రీను (లేటు) వగైరా -ప్రతివాదులు

టు:

2వ ప్రతివాది:
తాడి వెంకటలక్ష్మి, W/o శ్రీనివాసులు @ శ్రీను (లేటు) డోర్ నెం. 17-8-7, 7వ వార్డు, పల్లపు వీధి, పాలకొల్లు, ప.గో.జిల్లా.

3వ ప్రతివాది:
తాడి వెంకటేశ్వరరావు, S/o శ్రీనివాసులు @ శ్రీను (లేటు) డోర్ నెం. 17-8-7, 7వ వార్డు, పల్లపు వీధి, పాలకొల్లు, ప.గో.జిల్లా.

పై నెంబరు దావాలో ఎన్ని పర్యాయాలు శ్రీ కోర్టు వారు మీకు దావాసమన్లు పంపించినప్పటికి మీరు ఉద్దేశపూర్వకంగా దావాసమన్లు అందుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేసియున్నారు. దావా **ది. 22-07-2024వ తేదీనకు** వాయిదా అయివున్నది. కావున మీరు వ్యక్తిగతంగా గాని లేదా మీ పరోక్షమున ప్లీడర్ గారి ద్వారా గాని కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. సదరు దావాకు మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమున దావా గ్రంథము జరుపబడునని తెలియచేయడమైంది.

(By Order)

వలవల సత్యనారాయణ మూర్తి M.A., B.Ed., LLB

తేది:13-07-2024 **సంగినీడి శ్రీ ఆంజనేయులు** B.A., LLB.,
పాలకొల్లు న్యాయవాదులు, పాలకొల్లు
సెల్: 9849038805, 9030256223

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), భీమవరం వారి కోర్టులో

O.S.No.104/2021

యర్రంశెట్టి వెంకట లక్ష్మి ...వాది
మరియు
బండారు వెంకట మణి @ మణి కుమార్ వగైరాలు ...ప్రతివాదులు

5వ ప్రతివాది :
శ్రీమతి నాగం స్వాతి, W/o.సుధీర్, D/o. లేట్: వెంకట సుబ్బయ్యనాయుడు, కుప్పనపూడి గ్రామం, ఆకివీడు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు గ్రంథంలో 5వ ప్రతివాది అయిన శ్రీమతి నాగం స్వాతి గార్కి శ్రీయుత కోర్టు వారి ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను నోటీసులు పంపినను తీసుకొనక, కాలయాపన చేయుచున్నారని, దానిపై శ్రీయుత కోర్టు వారు పేపరు ప్రకటన అనుమతి మంజూరు చేసియున్నారు. శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం **ది.01-08-2024** తేదీకి వాయిదా అయి వున్నది. కావున 5వ ప్రతివాది అయిన శ్రీమతి నాగం స్వాతి గారు **ది.01-08-2024 ఉదయం 10.30 ని॥లకు** తమ అభ్యంతరములు స్వయంగా గాని, తమ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీయుత కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలియచేసుకొనవలెను. లేనియడల సదరు 5వ ప్రతివాది అయిన శ్రీమతి నాగం స్వాతి గారిని పరోక్షమున తీర్మానించబడును అని అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

అల్లూరి వెంకటేశ్వరరాజు
భీమవరం వాది తరపు అడ్వకేట్,
తేది.13-7-2024 సెల్: 9848211102